# నెలన్నర రోజులకే
# పనిచేయని కియోస్క్‌లు
## ఇష్టానుసారంగా వాడకంతో సాఫ్ట్‌వేర్ మొరాయింపు

తిరుమల,ఆగస్ట్ 3(ప్రభాతవార్తప్రతినిధి:



భక్తులు సులభంగా లడ్డూలను పొందేందుకు లడ్డూవితరణశాల ప్రాంగణంలో ఏర్పాటైన పలు బ్యాంకుల కియోస్క్‌లు పనిచేయడం లేదు. ఇవి పనిచేయకపోవడంతో భక్తులు నగదు చెల్లించి లడ్డూలు కొనుగోలుచేయాల్సి వస్తోంది. లడ్డూ ప్రసాదాన్ని భక్తులు సులభంగా అందుకునేందుకు వీలుగా టిటిడి అధికారులు "కియోస్క్"యంత్రాలను జూన్ నెలలో ఐదు వాటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యంత్రాలను లడ్డూవితరణశాలలో ప్రవేశ ద్వారం వద్ద, ఆపై మొదటి అంతస్థులో కౌంటర్లకు సమీపంలో ఏర్పాటుచేశారు. యూనియ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఐదు కియోస్క్ యంత్రాల్లో రెండు యంత్రాలు పనిచేయడంలేదు. ఆదివారం భక్తులు వీటివరకు వచ్చి వెనుదిరిగి నగదు చెల్లించి లడ్డూలు అందుకునే పరిస్థితి కనిపించింది. దర్శన టిక్కెట్ కలిగిన భక్తులకు లడ్డూప్రసాదం, దర్శనం టిక్కెట్ లేని భక్తులకు ఆధార్‌కార్డు ఆదారంగా లడ్డూలు అందుకునేందుకు సాంకేతికతను అమర్చారు. దీనిపై భక్తులు ఏదేని ఒకదానిని వినియోగించుకుంటే లడ్డూలకు దర్శన టిక్కెట్‌నంబర్‌గానీ, ఆధార్‌కార్డునంబర్ నమోదు చేయాలి. ఆ తరువాత మొబైల్‌నంబర్ నమోదు చేస్తే ఎన్ని లడ్డూలు అవసరం అనేది తెరపై కనిపిస్తుంది. భక్తులు ఆధార్‌కార్డు ఆధారంగా కేవలం 2లడ్డూలు మాత్రమే అందుకునే అవకాశం ఉంది. చేతిలో డబ్బులు లేకున్నా కియోస్క్‌ల ద్వారా యుపిఐ స్కానర్‌తో నగదు చెల్లింపులు జరిపి, కౌంటర్‌ల వద్ద నిరీక్షించే అవసరం లేకుండా లడ్డూలు పొందవచ్చు. ఇవీ పనిచేయడంలేదు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## 8న సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ఆగస్టు 8న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదివారం వివరించారు. వరలక్ష్మీ వ్రతంతో రాహు కేతు దోష నివారణ పూజలు జరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రహ్మగుడి ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు ఒకే సారి వెయ్యిమ ంది అయినా కూర్చొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వరలక్ష్మీ అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే కార్యక్రమాలకు చక్కటి ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈమేరకు ఇంజనీరింగ్ అదికారులకు ఆదేశించినట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు.

# యువ శాస్త్రవేత్తల మరో ప్రపంచం 'తిరుపతి ఐసర్'

## సొంత గూటిలో 6వ స్నాతకోత్సవానికి సన్నాహాలు..
## తిరుపతి విద్యాహబ్‌లో మైలురాయి : డైరెక్టర్




**శ్రీకాళహస్తికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో వెలసిన భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధనా సంస్థ యువ శాస్త్రవేత్తల మరో ప్రపంచంగా చెప్పవచ్చు. తిరుపతి విద్యాహబ్‌లో ఇదో మైలు రాయిగా చెప్పవచ్చు. వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులతో యువశాస్త్రవేత్తలకు అవకాశం కల్పిస్తున్న సంస్థ.సుమారు 256 ఎకరాల విస్తీర్ణంలో 2015లో నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డిల కృషితో ఏర్పడిన ఈ సంస్థ సొంత గూటిలో(క్యాంపస్‌లో) 6వ స్నాతకోత్సవాన్ని జరుపుకోనున్నది.**

శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టాచార్య

శ్రీకాళహస్తికి సమీపంలో 2015లో వెలసిన భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధనా సంస్థ(ఐసర్') యువశాస్త్రవేత్తల మరో ప్రపంచంగా చెప్పవచ్చు. భారీ అంచనాలతో ఏర్పాటు చేసిన ఈ విధ్యసంస్థ సత్ఫలితాలను అందిస్తుంది. భారత దేశంలోని పరిశోధనా సంస్థల్లో పేరెన్నిక గన్న సంస్థగా గుర్తింపు సాధిస్తుంది. నాడు రూ.1491కోట్ల డిపిఆర్‌తో ప్రారంభమైన ఐసర్ ఎన్నో విజయాలతో ముందుకు సాగుతుంది. ఈ విద్యావనంలోకి అడుగుపెడితే ఇక బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సర్వం ఇదే ప్రపంచం అన్నట్లు తీర్చి దిద్దుతున్నారు. నిర్వాహకులు. ఒకటేమిటి ఎటు చూసినా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ఈ విద్యాసంస్థ తిరుపతి జిల్లాకు ఓ ముల్లోకాల్ని ఏలే ఏడుకొండల వాడు అందించిన వరంగా చెప్ప వచ్చు.ఈ విద్యాసంస్థ ఆవరణలోకి అడుగుపెడితే ఒక్కసారైనా తమ బిడ్డలను ఇక్కడ చదివించాలనే ఆలోచన రాక మానదు.విద్యతో పాటు విజ్ఞానాన్ని, మానసిక శారీరక, ధృడత్వాన్ని అందించేటట్లు రూపొందిస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఏర్పాట్లును చూస్తే ఇంత మహోన్నత విద్యాసంస్త తిరుపతి జిల్లాలో ఉండటం గర్వకారణంగా చెప్పవచ్చు. అంతేకాక తిరుపతి పేరుతో మరో దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేయటంలో నాటి నాయకుల ఉద్దేశ్యం ఏమైనా నేడు జాతీయ స్థాయిలో శ్రీకాళహస్తి పేరును గుర్తింపుకు తీసుకురావటం తథ్యమని చెప్పవచ్చు.

**6వ స్నాతకోత్సవానికి విస్తృత ఏర్పాట్లు:**

తిరుపతి ఐసర్ విద్యాసంస్థల సొంత భవనాల్లో నిర్వహించనున్న మొదటి స్నాతకోత్స వం(6వ స్నాతకోత్స వం) ఈ నెల 5న నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని డైరెక్టర్ ప్రోఫేసర్ సంతాను భట్టాచార్య ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు.ఆరవ స్నాతకోత్స వానికి ముఖ్యఅతిధిగా సోమాయియా విద్యావిహార్ యూనివర్శిటి ఛాన్స లర్ గోదావరి బయో రిఫైనరి లిమిటెడ్ ఎండి మరియు చైర్మెన్ సమీర్ సోమియా,ఐసర్ చైర్‌పర్స న్ ప్రోఫేసర్ జిల్లు సింగ్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు డైరెక్టర్ వివరించారు. ఐసర్ ప్రయాణంలో ఎన్నో మలుపులతో ముందు సాగుతుందని ప్రస్తుతం బిఎస్-ఎంఎస్ ద్యూయెల్ డిగ్రీ కోర్సు లను ప్రారంభిచనున్నట్లు వివరించారు. ఈ సంవత్స రం 4 సంవత్స రాల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ స్ ఎకానామిక్స్ మరియు స్టాటిస్టికల్ సైన్సు (బియస్-ఇఎస్ఎస్) డిగ్రీ ప్రారంభిచనున్నట్లు డైరెక్టర్ విలేకరుల సమావేశంలో వివరించారు.గత ఏడాది ఒక సంవత్స రం ప్రోఫేషనల్ మాస్టర్స్ ప్రోగ్రాంను ప్రారంభించామన్నారు. అలాగే రెండు సంవత్స రాల ఎం.ఎస్(ఆర్)ను లైఫ్ సైన్సు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కాంపస్‌లో ప్రసుత్తం 881 మంది బియస్-ఎంఎస్ విద్యార్థులు 307 మంది డాక్టరల్ విద్యార్థులు, 26 మంది పోస్టు డాక్టోరల్ విద్యార్థులు 80 మంది ప్రోఫేషనల్ మాస్టర్స్ విద్యార్థులున్నట్లు వివరించారు. కొత్తగా ఈ విద్యాసంవత్స రం 400 మంది కొత్త విద్యార్థులు రానున్నట్లు వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో డైరెక్టర్ సంతాన భట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రప్రీతి కోహిలి సింగ్,అస్టిటెంట్ రిజిస్ట్రార్ రమేష్,ప్రోఫేసర్ భానుశ్రీరెడ్డి,దీపక్, అంటోని, హిమాంశుశేఖర్, శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

# మోడీ నియంతలా వ్యవహరిస్తున్నారు
## - సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ




ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త

ప్రజాస్వామ్య దేశంలో ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నియంతలా వ్యవహరిస్తూ పాలన కొనసాగిస్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఆదివారం సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహిస్తున్న తిరుపతి జిల్లా సిపిఐ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రతిపక్షాలను లెక్కచేయడం లేదని, కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మాత్రం సలాం కొడుతున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను పావుగా చేసుకుని ఉపయోగిస్తూ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని చెప్పారు. అంతకుముందు సీపీఐ కార్యాలయం నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి, స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే అంతే..!
## - ఇదీ సూళ్లూరుపేట రోడ్ల పరిస్థితి



చెరువును తలపిస్తున్న రోడ్లు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త

చిన్నపాటి వర్షం వచ్చినా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రైల్వేఫీడర్స్ రోడ్డు, మున్సిపాలిటీకి వెళ్లే పార్కువీధితో పాటు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లపై ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతుండటంతో పట్టణంలో ఈ పరిస్థితి నెలకొంది. రోడ్లన్నీ ధ్వంసమై ఉన్న అరకొరా డ్రైనేజీ శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో నూతన డ్రైనేజీ నిర్మించకపోవడంతో పట్టణంలో చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లన్నీ చెరువును తలపిస్తున్నాయి. ఇలా కొన్నేళ్లుగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించి సూళ్లూరుపేటలోని డ్రైనేజీ వ్యవస్థతో పాటు ధ్వంసమైన రోడ్లను బాగు చేస్తే సమంజసంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ప్రాణం తీసిన విహారయాత్ర
## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం, మరొకరి పరిస్థితి విషమం



దొరవారిసత్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త:

సరదాగా వెళ్లి వద్దాం రా మామ అంటూ మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు లారీ ఢీకొని తిరుగురాని లోకానికి చేరారు. అల్లారి ముద్దుగా పెంచిన కన్న తల్లిదండ్రులు వారి కన్న బిడ్డల మృతదేహాల చూడగానే సృహ తప్పి కుప్పకూలారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామ సమీపంలోని బిపిసిఎల్ పెట్రోల్ బంకు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు నాయుడుపేట మండలం పుదురు గ్రామానికి చెందిన ఎల్లంపాటి భాను ప్రసాద్( 23), మూడునూరు గణేష (17), బట్ట అనీల్ మోటార్ సైకిల్‌లో పుదురు నుండి వరదయ్యపాలెం సమీపంలోని బత్తల వరం సమీపంలో ఉన్న వాటర్ ఫాల్స్ వద్దకు సరదాగా గడపడానికి బయలుదేరారు. అదే మార్గంలో నెల్లూరు నుంచి చెన్నె వైపు వెళుతున్న లారీ డ్రైవర్ సడన్ బేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో భవాని ప్రసాద్, గణేషులు అక్కడిక క్కడే మృతి చెందారు. బట్టా అనిల్ తీవ్ర గాయా లయ్యాయి. దీంతో అనిల్‌ను టోల్ ప్లాజా అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కొరకు తిరుపతిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహా లను పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ అజయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా శ్రీకనకనాంచారమ్మ జాతర
## - పోటెత్తిన ఆంధ్ర..తమిళ భక్తులు .. ప్రత్యేక పూజలు !!



అమ్మవారి జాతర దృశ్యం

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఆహ్లాదకర అటవీ ప్రాంతం.. పాలారు నదీ తీరం.. పచ్చటి వృక్షాల మధ్య కొలువైన శ్రీ కనకనాంచారమ్మ భక్తుల కొంగుబంగార ం. ఆ అమ్మవారి జాతర ఆదివారం పెద్ద ఎత్తున జరిగింది. మండలంలోని నాయనూరు పంచాయతీ పెద్దవంక గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కనకనాంచారమ్మ ఆలయంలో ఏటా ఆడి 18న జాతర నిర్వహించడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజామున ఐదు గంటలకు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కాగా సంతానం లేని వారు అమ్మవారిని మొక్కుకుని తమకు సంతానం ప్రసాదించాలని పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న చెట్టుకు ముడుపులు కట్టారు. కాగా దెయ్యాలు వదిలించే కార్యక్రమంకు జనం బారులు తీరారు. పూజారులు జాటీకోళ్లతో దెయ్యాలు పట్టిన వారిని విదిలించారు. ఉదయం నుంచి రాత్రి దాకా ఆలయం వద్ద సందడి కన్పించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పీ పార్థసారథి నేతృత్వంలో అర్బన్ సిఐ శంకరయ్య బందోబస్తు చేపట్టారు. జాతర సందర్భంగా పెద్దవంక ప్రాంతంలో భారీగా దుకాణాలు వెలిశాయి. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు నాసప్ప, దివాకర్, మురుగేష్, నేతలు సత్యేంద్రశేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి హడలెత్తిస్తున్న "స్మార్ట్‌మీటర్లు"!
## -ఏర్పాటుపై గందరగోళం

ప్రభాతవార్త-తిరుపతి:




విద్యుత్ వినియోగానికి సంబంధించి ఇప్పుడు ఏపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ సామాన్యుడికి హడలెత్తిస్తోంది. ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు డబ్బు చెల్లించుకోవాలని, మీటర్లు ఏర్పాటు తరువాత విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగిపోతాయేమోనని ఆందోళన వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ స్మార్ట్‌మీటర్లు రగడ జనంలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రాష్ట్రవిద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా స్మార్ట్‌మీటర్లు బలవంతంగా బిగించబోమని, వినియోగదారులు అంగీకారం లేకుండా అసలు మీటర్లు పెట్టబోమని ప్రకటించారు. అంతేగాక ఎస్‌పిడిసిఎల్ సిఎండి కూడా స్మార్ట్‌మీటరు విషయంలో జనం ఆందోళన వద్దని, ఎలాంటి విపరీత బిల్లులు రావని తెలిపారు. అయినా జనంలో మాత్రం స్మార్ట్‌మీటర్లు గుబులు రేకెత్తిస్తోంది. ఇప్పటికే తిరుపతి డివిజన్ పరిధిలో కొన్ని వాణిజ్య కార్యకలాపాల్లో విద్యుత్ స్మార్టుమీటర్లు ఏర్పాటయ్యాయి. ప్రయోగాత్మకంగా మీటర్లు బిగించిన చోట్ల బిల్లులు అమాంతంగా పెరిగాయని, ఇది స్మార్ట్ భయమని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్‌మీటర్లు వల్ల వినియోగదారులకు మంచి జరుగుతుందని, మీటర్ రీడింగ్‌లో మానవ ప్రమేయం ఉండదని, బిల్లులు ఖచ్చితంగా వస్తాయనే మాటలు వినిపిస్తున్నారు. విద్యుత్ చౌర్యాన్ని, సరఫరాలో అంతరాయాలను సులభంగా గుర్తించవచ్చనేది, ప్రీపెయిడ్ విదానం వల్ల సెల్‌ఫోన్లకు రీచార్జిచేసుకున్నట్లే ముందుగా డబ్బు చెల్లించి విద్యుత్‌ను వాడుకోవచ్చనేది ఎస్‌పిడిసిఎల్ అదికారుల వాదన. ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్మార్ట్‌మీటర్లు రగడ ఎంతవరకు ఎక్కడకు దారితీస్తుందో చూడాల్సిందే. మరోవైపు ముఖ్యమంత్రి, ప్రధాని కూడా సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలు దృష్టిపెట్టాలని, సోలార్ విద్యుత్ కోసం ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటన చేస్తున్నారు. ఇప్పటికే తిరుపతి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతగ్రామం నారావారిపల్లి, కందులవారిపల్లిలో సోలార్ పవర్ పై తగిన చర్యలు తీసుకుంటున్నారు. సోలార్‌పవర్ వల్ల బిల్లుల భయం ఉండదని, మిగులు విద్యుత్‌ను డబ్బులుగా మార్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక,వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు ,నెలకు 200 యూనిట్లకుపైగా ఇళ్ళలో వాడే వినియోగదారులకు మాత్రమే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తున్నామనేది ఎస్‌పిడిసిఎల్ అధికారుల వాదన. ఒక ఇంటి వినియోగానికి 150 రూపాయలు వరకు వచ్చే విద్యుత్ బిల్లు స్మార్ట్‌తో 400వరకు వచ్చే అవకాశం ఉందనేది జనంలో అపోహలు. అయినా బలవంతంగా బిగించబోమని,, వినియోగదారులు వద్దంటే ఈ స్మార్ట్‌జోలికివెళ్ళమని చెబుతున్నారు. స్మార్ట్‌మీటర్లు జనంలో చర్చగా మారింది.

# వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త



సత్యకుమార్‌కు స్వాగతం పలుకుతున్న బిజెపి శ్రేణులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్య కుమార్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీహరి తదితర నేతలు విమానాశ్రయం లోపల పూల బొకేలు ఇచ్చి, శాలువలు కప్పి స్వాగతం పలుకుగా బిజెపి మండల నాయకులు, ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్ కుర్ర కాలవ వేణు గోపాల్ ముదిరాజ్, రేణిగుంట బిజెపి మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్ రెడ్డి, రేణిగుంట పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, బిజెపి మండల నాయకులు, మీడియా కోఆర్డినేటర్ రాజా రాయల్, యతేంద్రరెడ్డి, రమణారెడ్డి, ఆనంద్, అశోక్ తదితర యువనేతలు విమానాశ్రయం పోర్టికోలో మంత్రికి బొకేలిచ్చి, శాలువలు కప్పి, సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## నామినేషన్ల ప్రక్రియలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు : డిఎస్పీ

కుప్పం, ఆగస్టు 3ప్రభాతవార్త

రామకుప్పం మండలం మణీంద్రం ఎంపిటిసి ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్ర క్రియ పూర్తయిందని, ఇందుకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే దాకా ప్రజలు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. మణీంద్రం సెగ్మెంట్‌లో ఎన్నికల కోడ్‌తో పాటు నియోజకవర్గంలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందనే విషయం గ్రహించాలన్నారు.

## ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలి

పులిచెర్ల, ఆగస్టు 3, ప్రభాతవార్త



నిఘా సూర్య ప్రజలకు నిస్వార్థం గా సేవలు అందించాలని అప్పుడే ప్రజల మన్ననలు తోపాటు గుర్తిం పు వస్తుందని టిడిపి సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి రామనాథం నాయుడు అన్నారు. పులిచెర్ల మండలం రాయవారి పల్లి గ్రామ సచివాలయం నుంచి బదిలీ అయిన సిబ్బందిని టిడిపి నాయకులు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ తమ విధులలో ప్రజలు ఎంతో సహకారం అందించారని ఇక్కడ పనిచేసిన సమయాన్ని ఎప్పుడూ మర్చిపోమని అందరికీ కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సింధు రవి, టిడిపి నాయకులు నాగరాజు నాయుడు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం డిప్యూటి సిఎంలపై వివాదస్పద పోస్టులు..కేసు నమోదు

పెద్దపంజాణి ఆగస్టు 3 ప్రభాతవార్త:

సిఎం చంద్రబాబు,డిప్యూటి సిఎం పవన్‌కళ్యాన్‌ను అగౌరపరచేలా వాట్సప్‌లో స్టేటస్ పెట్టిన ఇద్దరమంది యువకులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపంజాణి ఎస్సై ధనుంజయ రెడ్డి తెలిపారు.తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బయ్యారెడ్డి,లశోక్ అనే ఇద్దరు యువకులు సిఎం,డిప్యూటి సిఎంలను అగౌరపరిచేలా రెండు గ్రూపుల మధ్య వివాదం సృష్టించేలా వాట్సప్‌లో స్టేటస్ పెట్టారు దీనిపై పెద్దకాప్పల్లి టిడిపి అధ్యక్షుడు రమణారెడ్డి ఫిర్యాదు చేయడంతో బయ్యారెడ్డి,అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేపోష్టులు ఎవరైనా పెడితే కఠనచర్యలు తీసుకుంటామని ఎస్సై ధనంజయ రెడ్డి హెచ్చరించారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

– కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలనుంచి వినతులు నేరుగా సీ స్వకరించడం జరుగుతుందని నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పాదయాత్ర నిర్వాహకులకు పోలీసుల నోటీసులు

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పేరిట పాదయాత్ర చేపట్టిన రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అశోక్‌బాబు, ఇతర దళిత సంఘాల నేతలకు పోలీసు అధికారులు నోటీసులు జారీ చేశారు. పాదయాత్ర సందర్భంగా నేతలు మాట్లాడిన మాటలు, వర్గీకరణ అంశం మరో సామాజిక వర్గానికి అభ్యంతరంగా ఉన్నాయని ఈ పాదయాత్ర గ్రామాల్లో, పట్టణాల్లో కొనసాగిసే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అందుకై పాదయాత్ర నిలుపుదల చేయాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పాదయాత్ర కార్యక్రమంను రద్దు చేసుకుని నేతలు పిఇఎస్ వైద్య కళాశాల వద్ద నుంచి వెనుతిరిగారు.

## కర్నాటక గవర్నర్‌ను కలిసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



కర్నాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లో ట్‌ను ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలి శారు. కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు నుండి కర్నాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తిరుపతి వెళ్తూ మార్గమధ్యలో చిత్తూరు ఆర్‌అండ్‌బి గెస్ట్ గౌస్‌లో ఆదివారం కొంత సమయం విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ కర్నాటక గవర్నర్‌ను ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం కలెక్టర్ కర్నాటక రాష్ట్ర గవర్నర్‌కు కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి చిత్రపటంను బహుకరించారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్ళారు.

## జొన్నగురకలలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



తవణంపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిపెస్టో సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా తొలివిడత రైతులు ఖాతాల్లో నిధులు జమచేయడంతో కూటమినేతల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు, కూటమి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా సప్తగిరి ప్రసాద్ మాట్లాడుతూ జొన్నగురకల గ్రామ సచివాలయ పరిధిలో సుమారు 300 మంది రైతులకు పైగా ఖాతాలలో తొలివిడత అన్నదాత సుఖీభవ నిధులు జమచేసినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుకుమార్, రైతు కార్యదర్శి జయపాల్, పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి షబ్బీర్‌భాషా, క్రిస్టియన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, బిసీ సెల్ నాయకులు రామచంద్ర, కిరణకుమార్, జనసేన నాయకులు అరగొండ మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు(చిన్న)కార్తీక్, బాబు రఘుపతి, అంభికాపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ శనివారాలలో ప్రసాదం పంపిణీ

పుంగనూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర స్వామిని శ్రద్ధ భక్తులతో పూజించే శ్రావణ శనివారాలలో భక్తులకు ప్రసాద వితరణను విశ్రాంత డిఎస్పి, తెలుగుదేశం నాయకుడు కల్వకుంట సుకుమార్ బాబు ప్రారంభించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే వేలాది మంది భక్తులకు స్వామివారికి నివేదించిన ప్రసాదాన్ని ప్రతి శనివారం ఈ మాసంలో అందజేస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ప్రగతి ప్రదాత వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షురాలు కనుమకుంట సులోచన పార్టీ నాయకులు రవికుమార్ శెట్టిలతోపాటు విశ్రాంత ఉద్యోగులు శ్రీనివాసులు, వెంకటపతి, సుకుమార్ బాబు కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నల్ల రాళ్ల గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



పుంగనూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త

మండలం మంగళం కాలనీలోని శ్రీ నల్ల రాళ్లపల్లి గంగమ్మ ఆల యంలో ఆదివారం నూతన ఉత్స వ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారికి చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పట్టణం నలుమూలల నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాయంకాలం అమ్మవారి ఊరేగింపు శోభాయమానంగా సాగింది. మంగళవాయి ద్యాలతో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

## పెన్షన్లు పంపిణీ చేయని పంచాయితీ కార్యదర్శి

పూతలపట్టు, ఆగస్టు 3, ప్రభాతవార్త





పూతలపట్టు మండలం గాండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి వృద్ధులకు వికలాంగులకు, వితంతువులకు ఇంతవరకు కూడా ప్రభుత్వం ఆసరా కల్పిస్తున్న పింఛన్ల పంపిణీలో జాప్యం వహిస్తూ తన వ్యక్తిగత మొబైల్‌ను ఆఫ్ చేసుకుని అందుబాటులో లేకపోవడం గమనార్హం. సుమారు 2,45,000 రూపాయలు నగదును డ్రా చేసుకొని ఎవరికీ పెన్షన్లు ఇవ్వకుండా అందుబాటు లేకుండా పోవడం గాండ్లపల్లి పంచాయతీలో ఉన్నటువంటి పింఛన్‌దారులకు అనుమానం కలిగిస్తోంది. అంతేకాకుండా గతంలో యాదమరి మండలం దళవాయిపల్లి పంచాయతీలో ఇదేవిధంగా పింఛన్ నిధులను దుర్వినియోగం చేయడం జరిగింది. కావున పూతలపట్టు మండల ఎంపీడీవో దీనిపై తక్షణమే స్పందించి పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్‌పై విచారణకు ఆదేశించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని గాండ్ల పల్లె పంచాయతీ వాసులు కోరుతున్నారు.

## దాడిచేసిన తెలుగుతమ్ముళ్లపై సిఎం చర్యలు చేపట్టాలి



– కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల గోపి

కుప్ప ం, ఆగస్టు 3 ప్రభాతవార్త రామకు ప్పం మండలం మణీంద్రం సెగ్మెం ట్ ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ స ందర్భంగా తమపై దాడి చేసిన తెలుగు తమ్ముళ్లపై సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కుప్పం ఇన్‌చార్జ్ ఆవులగోపి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున గీత అనే మహిళ ద్వారా తాము నామినేషన్ దాఖలుకు మండల కార్యాలయం వద్దకు వెళ్లగా తెదేపా నేత ఆనందరెడ్డి తన అనుచరులతో వచ్చి నామినేషన్ పత్రం లాక్కున్నాడని పేర్కొన్నారు. ఈ విషయం రామకుప్పం ఆరో వ్కు తెలియజేసి మరలా నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకుని డిసిసి అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, అధికార ప్రతినిధి శివశంకర్‌లతో కలసి వెళ్లగా తమతో పాటు కారుపై సైత ం ఆనందరెడ్డి, అతని అనుచరులు యాభైమంది దాడి చేశారన్నారు. తాము ప్రాణాలతో బ్రతికిబయటపడ్డామన్నారు. ఒక దళిత మహిళ చేతిలోని నామినేషన్‌ను లాక్కోవడంతో పాటు తెదేపాకు చెందిన మహిళా నేతలు అలివేలు, రాణెమ్మలు గీతను జుట్టుపట్టుకుని లాగారన్నారు. కాంగ్రెస్ పార్టీనా మీరు అంటూ అడిగి కొట్టారన్నారు. అదే వైకాపా తరపున నామినేషన్ వేస్తే వారిపై ఎందుకు దాడి చేయలేదని ప్రశ్నించారు. కుప్పంలో దాడుల స ంస్కృతికి సిఎం చంద్రబాబునాయుడు చెక్‌పెట్టాలని తమపై దాడి చేసిన తెదేపా నేతలను పార్టీనుంచి బహిష్కరించాలన్నారు. తమపై దాడి విషయంగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు మునస్వామి, ప్రకాష్, ఇర్ఫాన్, కృష్ణప్ప, పళని, వెంకటేష్, మునిరాజు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అధికార మదంతో దాడులు చేస్తే తిప్పికొడతాం

– చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారమదంతో దాడులు చేస్తే ప్రతిదాడులు చేసి తిప్పికొడతామని చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి అన్నారు. తోటపాళ్యంలో ఆదివారం వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంసి విజయానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు 140కి పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీల్లో కనీసం నాలుగంటే నాలుగు హామీలు సైతం అమలు చేయలేదని దుమ్మెత్తిపోశారు. ఎన్నికల్లో బాబు ష్యూరిటీ జాబ్ గ్యారంటీ అనే నినాదంలో ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు యువతను పెద్ద ఎత్తున మోసం చేశారని ధ్వజమెత్తారు. అధికారంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రతిపక్ష వైకాపా నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగానే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ బంగారుపాళ్యం పర్యటన, తన జన్మదిన వేడుకల సందర్భంగా పోలీసులు తమ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా బిసీ విభాగం నాయకులు జ్ఞానజగదీష్, చిత్తూరు నగర వైకాపా అధ్యక్షులు కెపి శ్రీధర్, వైకాపా నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరు అవుతారని, ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి తనను, జిల్లా అధికారులను కలిసి విన్నవించుకుంటే వాటిని సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు అందరు హాజరై ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఐరాలలో 400 మందికి ఉచిత వైద్యపరీక్షలు

ఐరాల, ఆగస్టు 3 ప్రభాతవార్త:



మండల కేంద్రం ఐరాల జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటై 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి 400 మందికి వైద్యపరీక్షలను నిర్వహించారు. ఈమేరకు తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి వారిచే ఐరాల ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం, బెంగుళూరు శ్రీశంకర్ క్యాన్సర్ ఆస్పత్రి వారిచే ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.ఈసందర్భంగా ఉచిత కంటి వైద్యశిభిరం ద్వారా 246 మందికి పరీక్షలు నిర్వహించి 46మంది రోగులను ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. అలాగే 153 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈవైద్యశిభిరాలను బంగారుపాళ్యం వైస్ ఛైర్మన్ నరిగన్నగారి సుధాకర్ ప్రారంభించగా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పుడు ఫిర్యాదులతో పార్టీనుంచి బహిష్కరించడం దారుణం - ఎంపిపి రెడ్డెప్ప

పెద్దపంజాణి ఆగస్టు 3 ప్రభాతవార్త:



కొంతమంది తనపై కక్ష సాధించేందుకు పార్టీకి తప్పుడు ఫిర్యాదులుచేసి తనను పార్టీనుంచి బహిష్కరించే స్థాయికి తీసుకురావడం దారుణమని పెద్దపంజాణి ఎంపిపి రెడ్డెప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు.తాను దళితుడు అనే చిన్నచూపుతోనే తనను సస్పెండ్ చేశారని ఆయన పేర్కొన్నారు.తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలు కానీ కార్యక్రమాలు కానీ నిర్వహించలేదన్నారు.తాను గతకొంతకా లంగా అనారోగ్యంతో బాదపడుతున్నాని పేర్కొన్నారు.వైద్యుల సూచనలు మేరకు తాను అనారోగ్యకారణాలతో విశ్రాంతి తీసుకుంటుండగా ఇదే అనుకూలమైన సమయమని భావించిన కొంతమంది నాయకులు తనపై ఉద్దేశపూర్వకంగానే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారని ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు.అధిష్టానం తనకు ఎలాంటి ముందస్తు సమాచారం నోటీసులు ఇవ్వకుండా పార్టీనుండి బహిష్కరించడం తాను ఊహించలేదని పేర్కొన్నారు.వాస్తవాలు త్వరలోనే పార్టీ అధిష్టానానికి తెలుస్తాయని ఆయన తెలిపారు.

## అరగొండలో ఘనంగా గుర్రప్పస్వామి జాతర

తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండలో వెలసిన శ్రీగుర్రప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం గుర్రప్పస్వామి జాతరను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి ఏటా గ్రామంలోని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర యంలో ఆడినెలలో జాతరను నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆదివారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని స్వామివారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామ సమీపంలోని బహుదానది ఒడ్డున వున్న గుర్రప్ప స్వామి ఆలయంలకు తీసుకువెళ్ళి పొంగళ్ళు పెట్టి జంతుబలులతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని దేదీప్యమానంగా అలంకరించి ప్రత్యేపూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాలసాహిత్యం నేటి సమాజానికి అవసరం

తిరుపతి విద్య ఆగస్టు 3 ప్రభాత వార్త





బాలసాహిత్యం నేటి సమాజానికి అవసరమని ఎస్వీయూ వీసీ అప్పారావు పేర్కొన్నారు.ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాల్లో ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ కృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్కు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి కవులు, అధ్యాపకులు, ప్రముఖులతో కలసి అవార్డు గ్రహీతను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ బాల సాహిత్య వేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్కు కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు వరించడం అభినందనీయమన్నారు. ఆయన రచించిన పుస్తకాలలో కుటుంబ విలువలు,నైతికత, సమాజం విశిష్టత ఉట్టిపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అప్పారావు, అవధాని మేడసాని మోహన్, ప్రొఫెసర్ పీసీ వెంకటేశర్లు, ఆచార్య గోవిందరాజు,జక్కంపూడి మునిరత్నం,డాక్టర్ వేణుగోపాల్,డాక్టర్ రామలింగయ్య,డాక్టర్ రాసాని,బాలాజీ,కృష్ణస్వామి మల్లీశ్వరావు, కవులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త

మండలం మార్లపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె శనివారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై బంధువుల ఇళ్లతో పాటు గ్రామంలోని పలుచోట్ల గాలించారు. కానీ ఎలాంటి సమాచారం లభించలేదు. అనంతరం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ అశ్వర్థ నారాయణ తెలిపారు. బాలిక కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన





తిరుపతి హెల్త్ ఆగస్టు 3 ప్రభాత వార్త

స్నేహితుల దినోత్స వం పురస్కరించుకొని స్థానిక 13 వ డివిజన్ న్యూ ఇందిరా నగర్ లో సాధన మహిళ అభ్యుదయ సేవా సంఘం,ఎంఎస్ హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కార్పొరేటర్ ఆంజనేయులు,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ రాపూర్ ప్రసాద్ బాబు అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఆరోగ్య సేవలు,ఉచిత వైద్య పరీక్షలు అందించడం సామాజిక బాధ్యతను నెరవేర్చే గొప్ప కార్యమని అన్నారు.ఉచితంగా మందులు అందజేసి. బీపీ,షుగర్,పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 400 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ముందస్తుగా రోగనిర్ధారణ జరగడంతో పాటు జాగ్రత్తల గురించి డాక్టర్ అవగాహన కల్పించారు.అవసరమైన వారికి సర్జరీలు కూడా ఆరోగ్యశ్రీలో చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రెసిడెంట్ సరళ సెక్రటరీ ఝూన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల ఆత్మగౌరవం కాపాడేందుకే రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

### - రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు

కుప ్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఎస్సీల ఆత్మగౌరవం కాపాడడంతో పాటు వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టినట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం కుప్పంలోని అంబేద ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పరిరక్షణ యాత్రను కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీల జనాభా పెరిగిందని అందుకు అనుగుణంగా దళితులకు ఇరవై శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దాకా ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అంతకుముందు డా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పలువురు వక్తలు ప్రస ంగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి దళిత నేతలు హాజరై పాదయాత్రకు సంఘీభావం పలికారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు యమలా సుదర్శన్, చెన్నకేశవులు, వెంకయ్య, మహానంది, ఆకుల గజేంద్ర, దాము, కిషోర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పొలాలకు బాట ఏర్పాటుచేసుకుంటే అధికారులకు అభ్యంతరమేమి!

తొట్టంబేడు ఆగస్టు 3 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం చియ్యవరం, చేమూరు గ్రామ రైతులకు సంబం దించిన పంట పొలాలకు వెళ్ళటానికి బాట ఏర్పాటు చేసుకుంటే అధికారు లకు వచ్చిన అభ్యంతరమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బాటలు బురదమయంగా మారాయి. రాక పోకలకు అంతరాయంగా మారింది. దాంతో నిత్యం పంట పొలాలకు వెళ్ళాల్సిన రైతులు కలిసికట్టుగా చింతల చెరువు నుంచి ట్రాక్టర్ల సహాయంతో బురదమట్టిని పూడ్చి వడ్లు తొలుకొనుటకు బాగుచేసుకుంటున్న సందర్భంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ వచ్చి రైతులను మందలించి దుర్భషలాడి పనులను ఆపి వేశారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.పక్క గ్రామాలైన పెన్నలపాడు ఇసుకటిప్పర్లతో తరలిస్తుంటే అటు వైపు కన్నెత్తి చూడని పోలీసులు రైతులు తమ పొలాల్లో పండిన ధాన్యాన్ని తరలించుటకు మట్టిరోడ్డు వేసుకుంటుంటే పోలీసులు ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు.మండలంలో ఇసుకాసురులు బాకసూరులగా దిగమింగుతుంటే పట్టించుకోని అధికారులు గ్రామాల్లో వడ్లు తొలుకోవడానికి వచ్చిన అంతర్యమేంటోనని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.దీని పై అధికారులు స్పందించాల్సి ఉంది.

# అలనాటి పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



స్నేహ మేర జీవితం...స్నేహమేర శాశ్వతం...

-ఫ్రెండ్‌షిఫ్ డేలో చెర్లోపల్లి హైస్కూల్

1985-86 టెన్త్ బ్యాచ్

**తిరుపతిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** స్నేహ మేర జీవితం...స్నేహ మేర శాశ్వతం అనే పంథాలో 40 సంవత్సరాల తర్వాత చెర్లోపల్లి హై స్కూల్లో 10వ తరగతిన చదివిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై కలిసి యోగ క్షేమాలు పంచుకున్నారు. చిన్ననాటి స్నేహ బంధాన్ని నెమరు వేసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పైడిపల్లి వద్ద ఓ మామిడితోపు కలిసి ఆనందంగా గడిపారు. అలనాడు చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలు గుర్తు చేసుకోవడమే కాకుండా ప్రస్తుతం ఎవర్వేరు ఎలా ఉన్నారు...ఏ ఏ రంగాలలో స్థిరపడ్డారు...ఎవరి పిల్లలు ఏమి చదువుతున్నారు, అనే విషయాలను ఒకరి నోకరు అప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులలో ఎవరైన ఇబ్బందుల్లో ఉంటే తగిన సహాయ, సహకారాలు అందించాటనికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులలో మరణించినవారికి రెండు నిమిషాలు పాటు మౌనం వహిస్తూ నివాళ్ళు అర్పించారు.

**గురువులకు ఘనంగా సన్మానం**

చెర్లోపల్లి హై స్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థుల గురువులైన సుధాకర్‌నాయుడు, శివలక్ష్మీలను ఘనంగా సన్మానించి, గురుభక్తిని చాటుకున్నారు. ఎప్పటిలాగా కాకుండా ఈసారి గురువులను స్నేహితుల దినోత్సవం రోజు సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మధ్యాహ్నం సామూహికంగా సహాపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి హై స్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు గుత్తా కోటేశ్వరనాయుడు, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, జానకిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హేమలత, జ్యోతి, లక్ష్మీ, చంద్రకళ,మునికృష్ణారెడ్డి, మురళినాయుడు, ఉమా మహేశ్వరరెడ్డి, మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రైతు ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**వడమాలపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త:** రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. వడమాలపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్న దాతలైన రైతుల ప్రయోజనాలే ముఖ్యమని భావించిన చంద్రబాబునాయుడు వివిధ పథకాలు అమలు చేసి వారిని ఆదుకుంటున్నారని తెలిపారు. రైతే రాజు, రైతు సంక్షేమమే ముఖ్యమని నమ్మిన నాయకుకు చంద్రబాబునాయుడు అని తెలిపారు. చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయమే కాక ఇతర వృత్తులకు సహకార సంఘంలో రుణాలు పొందవచ్చన్నారు. ఎంపికైన వారు ఎమ్మెల్యేకు చెడ్డపేరు రాకుండాపనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. దేవూరి భూ చంద్రప్రసాద్(కుమార్) డైరెక్టర్లు పొన్నయ్యరాజు, వెంకటరమణలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికారప్రతినిధి ధనంజయలునాయుడు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్, అబ్బురాజు, మాజీ సర్పంచ్‌లు చలపతి, హేమాద్రినాయుడు, సర్పంచ్ అంజమ్మ, ముని, రాధాకృష్ణ, పెద్దబ్బరాజు, శివ, వినోద్, హేమావతి, లక్ష్మిప్రసన్న, ఉమాపతి, ఉమాపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## కోసలనగరంలో సుపరిపాలన తొలి అడుగు

**విజయపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



మండలంలోని కోసలనగరం పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు ఆదివారం కోసలనగరం పీఏసీఎస్ అధ్యక్షుడు బాబుయాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గత ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ధనమ్మ మృతి పార్టీకి తీరనిలోటు



**రామచంద్రాపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ సిపి చిత్తూరు జిల్లా ప్రచార విభాగం వైస్ ప్రెసిడెంట్ యోగానందరెడ్డి తల్లి ధనమ్మ మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణా కర్ రెడ్డి అన్నారు. ఆదివారం నడవలూరులో చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో కలసి ధనమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మీకు పార్టీ అన్ని విధాలుగా అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, నాయకులు సిద్దమునిరెడ్డి, గిరిధర్ రెడ్డి, మురగయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## భకాసురుడి వధకు బండికుంభాలు

**రామచంద్రాపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:**



ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం భకాసురుడి వధకు బండికుంభాలు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి ఎడ్లబండ్లను రంగు కాగితాలు, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఎడ్లబండ్లపై భీమసేనుడి వేషధారి, భీమసేనుడి ఉత్సవ విగ్రహంను కొలువుగావించి గ్రామంలో ఊరేగింపుగా వెళ్ళి పంచభక్ష పరమాన్నాలను సేకరించి, ద్రౌపతీ అమ్మవారి ఆలయానికి చేర్చారు. అనంతరం బండికుంభాన్ని ఆహారంగా భకాసురుడికి తీసుకువచ్చామనీ, భక్షించడానికి రావాలని కబురు పంపారు. ఈ నేపథ్యంలో భకాసురుడికి, భీమసేనుడికి మధ్యన భీకర యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో భీమసేనుడు తన గదాయుధంతో భకాసురుడిని వధించడం జరుగుతుంది.

## నేటి నుంచి నీలకంఠేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు

**శ్రీకాళహస్తి రూరల్ ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయాలైన ఊరందూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి వార్షిక బ్రహోత్సవాలు నేటి నుంచి 14 వరకు జరుగుతాయని ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి ఆదివారం మీడియాకు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబం ధంగా ఉన్న ఆలయాలలో నిర్వహించే కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. గ్రామాల్లో ఆలయాల్లో నిర్వహించే ధార్మిక ఉత్సవాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఓ ధార్మిక కార్యక్రమాలతో పాటు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నామని వివరించారు. ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని దశల వారిగా అభివృద్ధి చేసామన్నారు.

**నేటి ఉత్సవాలు**

సోమవారం అంకురార్పణ,ధ్వజారోహణం,రాత్రి చప్పరం ఉత్సవం 5 న సూర్యప్రభవాహనం 6 న చంద్రప్రభ వాహనం 7 న చిలకవాహనం 8 న కేతిగం ఉత్సవం రాత్రి నందిసేవ 9 న చప్పరఉత్సవం,రథోత్సవం 10 న కళ్యాణోత్సవం 11 న పార్వేట ఉత్సవం గుంటకిందపల్లి,జింగిలిపాళెం గ్రామాలకు చప్పర ఉత్సవం జరుగును.12 న తీర్థవారిధ్వజావరోహణం,13 న పల్లకిసేవ,ఏకాంతసేవలు నిర్వహించుటకు అర్చకులు నిర్ణయించారని ఇఓ తెలిపారు.భక్తులందరు పాల్గొన్ని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి.ఈ నేపథ్యంలో ఆదివారం కాకినాడ జిల్లా చేబ్రోలు వాస్తవ్యులు వంశీ రామకృష్ణ నిత్యాన్న ప్రసాదానికి విరాళం అందించారు. వంశీ రామకృష్ణ ఆదివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.తరువాత తాము నిత్యాన్న ప్రసాదానికి విరాళం అందించాలని కోరారు.రూ.51,116లు విరాళాన్ని ఎఇఒ మోహన్‌కు అందించారు. దాతకు ప్రత్యేక దర్శనం ఆశీర్వచనం అందించారు.

## పరశురామేశ్వరుని సేవలో విట్ విరాళం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని సేవలో ఆదివారం తమిళనాడులోని వేలూరు విట్‌కు చెందిన నాయకులు దర్శించుకున్నారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర తెలుసుకున్న వారు మీడియం సైజ్ కలశాలు, బిందెలు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డికి అందించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి ఆలయ మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికారు. విరాళం అందించిన దాతలకు వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## యువత సారధ్యంలో స్నేహితుల దినోత్సవం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి తెలుగు యువత సారధ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ తెలుగుదేశం మీడియా ప్రతినిధి నాగమల్లి దుర్గా ప్రసాద్ సారధ్యంలో స్వేహితుల దినోత్సవాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్బంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్బంగా మాజీ కౌన్సిలర్ కేక్ కట్ చేసారు.ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్,వినయ్‌కుమార్, ఖాదర్, అయ్యప్ప,బాలాజి,సిద్దులయ్య,వెంకటరమణ, అశ్వత్థమ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశుమందిర్‌కు ఇండియన్‌బ్యాంకు విరాళం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని సరస్వతి శిశుమందిర్ అభివృద్ధికి ఇండియన్‌బ్యాంకు మేనేజర్ భూరి విరాళాన్ని అందించారు. శ్రీకాళహస్తిలోని సరస్వతి శిశుమందిర్ పురాతన పాఠశాల. ఒకప్పుడు ఎంతో ప్రతిష్టగా నిర్వహించిన పాఠశాల నేడు ఆర్థికంగా వెనుకబడటంతో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకొని ముంద డుగు వేస్తున్నారు.ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రముఖులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షులు భక్తవత్సలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అద నపు గదులు డిజిటల్ లైబ్రరీ, డిజిల్ ఏర్పాటుకు సంబంధించి సుధీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఇండియన్‌బ్యాంకుమేనేజర్ ఎవిఎస్ సురేష్ మొదటి విరాళంగా రూ.50వేలు చెక్కును అందించారు.వారికి పాఠశాల తరపున సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో దంత వైద్యులు డాక్టర్ లక్ష్మీనారా యణ, పద్మావతి, మంగిరెడ్డి, ప్రకాష్, సుబ్రమణ్యం రెడ్డి బచ్చు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో పోలీసుల చైతన్యం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో యువకులు మద్యం సేవించటం అసాంఘీక కార్యక్రమాలకు పాల్గొనటం నిషేధమని పలువురిని చైతన్యపరచారు. శ్రీకాళహస్తి టౌన్ పోలీసులు ఆదివారం తుఫాన్ సెంటర్ సమీపంలోని ఓపెన్ ప్లేస్‌లో కొందరు బహిరంగంగా మద్యం సేవించటం రాకపోకలకు అంతరాయం కల్పించటంపై యువకులకు చైతన్య పరచారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే ఫిర్యాదు అందితే చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ డి.గోపి వివరించారు. సిఐతో పాటు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## వీరభద్రుడుని గజవాహన సేవలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



**నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం ప ంచాయతీ సముదాయం వీధిలో వెలసిన టిటిడి అనుంబంధ ఆలయం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఏడవరోజు ఆదివారం సాయంత్రం జరిగిన గజవాహన సేవలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. టిటిడి అధికారులు ఘన సా ్వగతం పలికి సత్కరించారు. రాత్రి 7గంటలకు గజవాహనంపై అధిరోహించి స్వామి, అమ్మవారిని ఊరేగారు. అంతకుముందు ఉదయం ఆలయంలో స్నపనతిరుమంజనం, శుద్ధి, నిత్య కైంకర్యపూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం, స్వామి, అమ్మవారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు మాజీ ఎంపిపిలు ఎపి భక్తవత్సలం, పి గోవిందస్వామి, మాజీ సర్పంచ్ కెఎస్‌రవిరెడ్డి, నాయకులు ఊరప్ప, సుధాబాబు, కుట్టి బాలయ్య, దేవరాజులు, మనోహర్, దిల్లీ, మోహన్, పెరియ స్వామి, కుమార్, రామలింగంమొదలియార్, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరికంబట్టులో సప్రవాహనంపై ఊరేగిన ధర్మరాజులస్వామి



**నారాయణవనం, ఆగస్టు 3 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం సాయంత్రం సప్రవాహనంపై వెంటకృష్ణపాలెం, ఎరికం బట్టు గ్రామాల్లో ఘనంగా ఊరేగారు. అంతకు ముందు ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, తోరణాలు, పచ్చనిమామిడి ఆకులతో అలంకరించారు. మేళాతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరే గారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హారతులు పట్టారు. మధ్యాహ్నం తిరుపతికి చెందిన హరికథ గాణ ప్రవీణ భాగవతారిణి యం.పూర్ణ ఆద్వర్యంలో మహాబారతం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం, అట్టహాసంగా స్నేహితుల దినోత్సవం



**చంద్రగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** వయస్సు మీదపడిన మనమందరం ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని స్మృతిలో వుం చుకోవాలని పూర్వ విద్యార్థులు పరస్పరం మనోభావాలను పంచుకు న్నారు. 1974-75 10వ తరగతి బ్యాచ్ 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం నాగయ్యగారిపల్లి వద్ద గల రిసార్ట్‌లో స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ముందుగా తమ సహచరుల మరణం పట్ల కొంత సమయం మౌనం పాటించి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు సంద్ర సిద్దయ్య గార్డెన్‌లోని రిసార్ట్‌లో వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 65 వసంతాలు పూర్తి చేసుకున్న మనం పరస్పరం సంభాషణలతో ఒకరికొకరు ఆరోగ్య సూత్రాలను పంచుకుని సంతోషంగా జీవించాలన్నారు. తమతో పాటు విద్యాభ్యాసం చేసి ఇప్పటికీ నిరుపేదరికాన్ని అనుభవిస్తున్న వారికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. 2016 నుండి నిర్వహించబడుతున్న అసోసియేషన్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రబాబు నాయుడు, అప్పయ్య శాస్త్రి, కార్యదర్శి పార్లపల్లి పరందామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ట్రెక్కింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు

- అటవీ క్షేత్ర అధికారిణి మాధవి హెచ్చరిక



**కేవీబీ పురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:** అనుమతులు లేని వారు అడవిలో ట్రెక్కింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పుత్తూరు రేంజ్ అటవీ క్షేత్ర అధికారిణి మాధవి అన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుత్తూరు రేంజ్ అటవీ ప్రాంతాల్లో అనేక జలపాతాలు, కోయ కోనలు, వాగులతో, ప్రఖ్యాతి వృక్షాలతో ప్రకృతి సౌందర్యం ఉందన్న విషయాన్ని తెలుసుకున్న కొంత మంది వ్యక్తులు అనధికారికంగా అనుమతులు లేకుండా ట్రెక్కింగ్ గ్రూప్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి ఫోటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టిప్రకృతి ప్రేమికులను మోసపూరితంగా ఆకర్షించి వారి వద్ద ఎక్కువ మొత్తంలో నగదును వసూలు చేసి అక్రమార్జన చేయడం అటవీ చట్ట రిత్యా నేరమన్నారు. అటవీ శాఖ అనుమతులు లేకుండా ఎవరైనా అడవుల్లో ట్రెక్కింగ్ నిర్వహించినా, మద్యపానం తీసుకెళ్లినా, వన్యప్రాణాలకు హాని తలపెట్టినా, ఫోటోలు, వీడియోలు తీసి ప్రచారం మాధ్యమాల్లో పోస్టు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉపాధి పనులు కల్పించండి

ఆరు నెలలుగా ఉపాధి పనులకు దూరంగా ఉన్న రాయపేడు గ్రామస్తులు

**కేవీబీ పురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించి వలస బాటలను రూపుమాపడానికి తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం కొందరికి శాపంగా మారి ఆరు నెలలుగా ఉపాధికి దూరంగా ఉంటూ వలస బాటలో పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని 300 మంది ఉపాధి కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వివరాలు ఇలా... కేవీబీపురం మండలం రాయపేడు పంచాయతీలో సుమారు 350 మందికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్ కార్డుల ద్వారా సుమారు 500 మంది ఉపాధి కార్మికులు ఉపాధి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల రాయపేడు గ్రామంలో గత ఆరు నెలలుగా ఉపాధి పనులు లేక ప్రజల అవస్థలు పడుతున్నారు. గతంలో ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న వి.సుమన్ కుమార్‌కు 9 నెలలుగా జీతభత్యాలు చెల్లించకుండా వెట్టిచాకిరి చేయించుకున్న అధికారులు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో అర్థాంతరంగా అతన్ని విధుల నుంచి తొలగించడంతో గ్రామంలోని సుమారు 500 మంది ఉపాధి కార్మికులు ఆరు నెలలుగా ఉపాధి పనులకు దూరమై వలస బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రాయపేడు గ్రామంలో క్షేత్ర సహాయకుడిని నియమించి ఉపాధి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైతు బంధవుడు మనచంద్రబాబు

## రెడ్డివారిగురువారెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజక వర్గం ఏర్పేడు మండలం పల్లం పేట సెంటర్ నందు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రైతుల కోసం అన్న దాత సుఖీభవ ప్రకటించడం పై హర్షం చేస్తూ ఆయన చిత్రపటానికి పెద్దఎత్తున్న నాయకులు రైతులు నవధాన్యాలు,రాగులు, వరిధాన్యం,జొన్నలు,సజ్జలు గోధుమలు ఉద్దులు,పెసలు,మినుములు రైతు పండించే అన్ని పంటలతో అభిషేకాలు నిర్వహించామని రాష్ట్రపార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారిగురువారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమం ద్వారా సూపర్‌సిక్స్ పథకాల కార్యక్రమాల ద్వారా హామి ఇచ్చారన్నారు.రైతులకు వారి అకౌంట్స్‌లో అన్నదాత సుఖీభవ స్కీంద్వారా 20000 వేల రూపాయిలు అందజేస్తామని మాటిచ్చి అందులో భాగంగా మొదటివిడతగా 7 వేల రూపాయిలను వారి ఖాతాల్లో జమచేశారు.ఈ మేరకు రెండు కంతుల్లో విడుదల చేస్తామని అదే విధంగా 45 లక్షల పై చిలుక రైతులకు సుమారు 5 వేల కోట్ల రూపాయిలను అందజేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు.ఇది రైతు ప్రభుత్వం అని తెలియజేయటానికి నిదర్శనం.అదే విధంగా దీపం పథకం ద్వారా మహిళల గ్యాస్‌సిలిండర్,ఉచితబస్సు ప్రయాణం అన్నింటి అమలు చేస్తూ ముందుకెళ్తున్న ఏకైక సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలుగుదేశం ప్రభుత్వానిదే అన్నారు.గతంలో వైకాపా పాలనలో నవరత్నాలు చెప్పి మోసాలకు పాల్పడిన ప్రభుత్వం ఓ ఒక్క వైకాపానే అన్నారు.అప్పుడు సూపర్‌సిక్స్ పథకాలు గాలిలో కలిసిపోయాయి అన్నట్లు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి కళ్ళు తెరిచి పైన కనబరిచిన పథకాలు కూడా వారి చూసి వారికి కన్నువిప్పు కలగాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగరాజనాయుడు,జిల్లా మాజీ ఉపాధ్యక్షులు డి.నాగేశ్వరరావు,నియోజక వర్గం మహిళా అధ్యక్షులు కృష్ణవేణి,క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌రెడ్డి,యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పార్టీ నాయకులు రాఘవేంద్రరావు,కేశినేని సుబ్రమణ్యం,మనోహర్‌నాయుడు,కృష్ణాయాదవ్,జగదీష్‌నాయుడు,వెంకయ్య,మునెయ్య,హరిరెడ్డి,రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

## అతిగా మద్యంతాగి వ్యక్తి మృతి

**శ్రీకాళహస్తి ఆగస్టు 3 ప్రభాతవార్త**



పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ సమీపంలో ఓ యువకుడు మృతి చెందినట్లు అర్బన్ సిఐ డి. గోపి ఆదివారం పత్రికల వారికి తెలిపారు.మృతి చెందిన వ్యక్తి పేరు మురళి(25) అని తెలిపారు. వెంకటగిరికి చెందిన మురళి తన తల్లి చెల్లితో పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో నివాసముంటారని వివరించారు. ఇతను పట్టణంలోని గుడివీధిలో ఉన్న శరవణ హోటల్‌లో పనిచేస్తుండేవారని ఇటీవల మద్యానికి బానిసై నిత్యం తాగుతూ ఎక్కడంటే అక్కడ పడిపోయే వారని ఈ మేరకు గడిచిన రెండు రోజులనుంచి మద్యం పూటుగా సేవించి ఆహారపానీయాలు లేకుండా అక్కడే చనిపోయినట్లు అక్కడున్న వారు తెలిపారన్నారు.అయితే ఈ విషయమై వారి తల్లిదండ్రుల దృష్టికి తేగా వారు కేసు పెట్టడానికి ఆసక్తి చూపలేదని అదేవిధంగా పోస్టుమార్టం నిమిత్తానికి కూడా వారు మొగ్గు చూపలేదన్నారు.

## వాకాడులో కార్డన్ అండ్ సర్చ్



వాకాడు, ఆగస్టు 3 ప్రభాతవార్త : పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన వాకాడులో ఎస్సై నాగబాబు బృందంతో డోర్ టు డోర్ తిరిగి ద్విచక్ర వాహనాలును సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై నాగబాబు మాట్లాడుతూ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు కార్డెన్ అండ్ సర్చ్ కార్యక్రమము ద్వారా వాకాడు లోని ద్విచక్ర వాహనాలును అదుపులోకి తీసుకుని సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరు సుకున్ని స్టేషన్లో పెట్టామన్నారు. ముఖ్యంగా ప్రతి ద్విచక్ర వాహనాన్ని మాదక ద్రవ్యాలు ఉంటాయని క్షుణ్ణంగా పరిశీలిం చామన్నారు. ఈ సర్చ్‌లో వాకాడు ఎస్సై నాగబాబుతో పాటు, చిట్టమూరు ఎస్ఐ బలరామయ్య, వాకాడు, కోట, చిట్టమూరు మండలాల పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గూడూరు డివిజన్

## విద్యార్థిని చదువుకు చేయూత



గూడూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : పట్టణంలోని డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్ నందు లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జే.పి, గూడూరు టౌన్ క్లబ్, వెస్ట్ క్లబ్ సేవ కార్యక్రమాలలో భాగంగా మాజీ అధ్యక్షులు మురళి రాజు దాతృత్వంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినికి కాలేజీ ఫీజు కోసం పది వేల రూపాయలను వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి. రావు చేతులు మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.వి రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాల పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ క్లబ్ అధ్యక్షులు జయ చంద్ర రెడ్డి, వై.జె.పి. క్లబ్ సెక్రటరీ. మురళి కృష్ణ, ట్రెజరర్ గోపినాథ్ రెడ్డి, వినోద్ కుమార్, కావేరి, పాల్గొన్నారు.

## ఘనంగా వైఎంఆర్‌సి స్వర్ణోత్సవ సంబరాలు



సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని యంగ్‌మెన్ రిక్రియేషన్ క్లబ్ ప్రారంభించి 50 సంవత్సరాలు పూరైన సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 50 ఏళ్లుగా వైఎంఆర్‌సి క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రశంసించారు. ఈ క్లబ్ సూళ్లూరుపేట పట్టణంలో సామాజిక కార్యక్రమాలు చేపట్టి మంచిపేరు తెచ్చుకుందని వక్తలు కొనియాడారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎంఆర్‌సి అధ్యక్ష, కార్యదర్శులు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, ఆరణి విజయ భాస్కర్‌రెడ్డి, మాదరపాక బాలసుబ్రహ్మణ్యం, కృష్ణ మీనన్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఈశ్వరవాక రాజారెడ్డి, కాళంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ క్రికెట్ లీగ్ సన్నాహక సమావేశం



గూడూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ సన్నాహక సమావేశం శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, అధ్యక్షత వహించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుండి 20 మండలాల జట్ల బాధ్యులు పాల్గొన్నారు. ఈ నెల 31, సెప్టెంబర్ 1,2,3 తేదీలలో నిర్వహించు టోర్నమెంట్ సంబంధించి నటువంటి విధివిధానాలను సమావేశంలో చర్చించ డమైనది. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరముల నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి టీచర్స్ క్రికెట్ లీగ్ ఈ సంవత్సరం కూడా ఉన్నతమైన ప్రణాళికలతో మెరుగైన నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.డి. కరీముల్లా ఖాన్, మురళి సింగ్, షేక్ బాబర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ క్రీడాకారులు ముని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న పద్మను ఇటీవల తాత్కాలిక మేనేజర్‌గా ఉన్న మునిచంద్ర సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గత కొన్నిరోజులుగా నేషనల్ మజ్దూర్ యూని యన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మజ్దూర్ యూనియన్ నాయకులు ఎం.శేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. డిపో ఇన్‌ఛార్జ్ మేనేజర్ మునిచంద్ర ఇప్పటికైనా స్పందించి అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాధయ్య, శీనయ్య, సుబ్బయ్య, ఎం.రమణయ్య, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓమోస్తారు వర్షం కురిసింది. ఈవర్షంతో గ్రామాల్లో ప్రజలు ఎండతీవ్రత నుండి కొంతవరకు ఉపశమనం పొందారు. గతవారం రోజుల నుండి భానుడు భగభగ మంటూ మండుతూ ఉండి సాయంత్ర మయంలో ఆకాశంలో నల్లటికారుమబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈవర్షంతో గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో, నాయుడుపేట పట్టణంలో ప్రజలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక అవస్థలు పడుతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

## నిబంధనలు పాటించని ప్రవేటు పాఠశాలలు

నాయుడుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : నాయుడుపేటలో కార్పొరేట్, ప్రవేటు పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా పుస్తకాల పేరుతో వేలకువేలు అక్రమంగా వసూళ్ళు చేస్తూ దోపిడికి పాల్పడు తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రవేటు పాఠశాలల నిర్వహకులు పస్ట్‌క్లాస్ నుండి పదోతరగతి వరకు వేలరూపాయలు దోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం పేద విద్యార్థులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో తల్లికి వందనం పథకం ద్వార ప్రతివిద్యార్థికి 13000 వేల రూపాయలు అందిస్తున్న ఆనగదు ప్రవేటు పాఠశాలల పుస్తకాల దోపిడికి సరిపోవడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త విద్యాశాఖాధికారి మునిరత్నంను వివరణ కోరగా ఆయన మాట్లడుతూ ప్రవేటు పాఠశాల యాజమాన్యంకు విద్యార్థులకు పుస్తకాలు అమ్మే అధికారం లేదన్నారు. ఈ విషయమై ఇంతవరకు నాదృష్టికి రాలేదని పాఠశాలలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

## యువకుడు ఆత్మహత్య



గూడూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : గూడూరు రైల్వే స్టేషన్ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల వివరాల మేరకు సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన పొట్టేళ్ల రాజ్ కుమార్ (26) అనే యువకుడు గ్రామంలో వ్యవసాయపనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్లోని ఒకటో నంబరు ప్లాట్ ఫామ్ లోని న్యూజలపాయగురి నుంచి చెన్నై వైపుకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి రైల్వేజీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

## కోటి రూపాయలు వరకు రుణాలు ఇస్తాం



వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త : కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ద్వారా చేనేత కార్మికులకు పదివేల రూపాయలు నుండి కోటి రూపాయలు వరకు రుణాలు ఇస్తామని ఆ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి కలిసి చేనేత కార్మికుల రుణాలు ఇవ్వాలని కోరగా ఆయన అంగీకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, చేనేత సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి సొసైటీల ద్వారా రుణాలు ఇచ్చే విషయమై చర్చిస్తామని తెలిపారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులకు కూడా విరివిగా రుణాలు ఇస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య నాయకులు ఉన్నారు.

## ఘనంగా నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వర్ధంతి



కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త : మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 47వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ప్రాంగణంలో ఉన్న బాలకృష్ణారెడ్డి విగ్రహానికి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు. విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి బాలకృష్ణారెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ముఖ్య కారణం ఈ విద్యాసంస్థలే అని పేర్కొన్నారు. ఎన్‌బికెఆర్‌లో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి నేటి తరాలకు ఆదర్శమని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలను రాష్ట్రంలోని టాప్ కళాశాలల్లో ఒకటిగా చేయడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గసముద్రంలో ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం



తిరుపతిరూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త: దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో భారతం మిట్టలో మహాభారత యజ్ఞాన్ని పురస్కరించుకుని ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. తిరుపతిరూరల్ మండలం దుర్గ సముద్రం గ్రామ పంచాయతీలో భారత ఉత్సవాలు ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్న విషయం తెల్సిందే. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. శ్రీవెం కటేశ్వర కళానాట్యమండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ద్రౌపతి ధర్మరాజుల ఆలయ ఆవరణలో మట్టితో దుర్యోధనుడి బొమ్మ రూపొందించి పూజలు చేసారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం చూపర్లను ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుడు మధ్య యుద్ధసన్నివేషాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గధతో కొట్టి వధించి, రక్తాన్ని ద్రౌపతిదేవి కురులకు పూసే సన్నివేషాలలో పాత్రదారులు జీవం పోశారు. ఉభయ దారులు మునిరెడ్డి ఇంటివద్దకు చేరుకుని ప్రత్యేక పుష్ప అలంకణ చేసకుని డప్పులు వాయిద్యాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. దుర్యోధన వధ అనంతరం ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు భాగవతారని రాణిరెడ్డిచే హరికథ కాలక్షేపం చేసారు. సాయంత్రం 5గంటలకు భక్తులు ఏడు బావులు దగ్గరకు వెళ్ళి స్నానాలు ఆచరించి, కంకణాలు ధరించి, అగ్నిగుండ ప్రవేశం చేసారు. ఈ కార్యక్రమంలో నాదమునిరెడ్డి, వెంకటరమణారెడ్డి, దామోదర్‌రెడ్డి, దేశిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జయకుమార్ యాదవ్, నాగిరెడ్డి పెద్దఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## తిరునాళ్లల్లో శాంతి భద్రతలపై రాజీ వద్దు : డిఎస్పీ



శ్రీకాళహస్తి రూరల్(ఏర్పేడు), ఆగస్టు 3 ప్రభాతవార్త : ఏర్పేడు మండల పాపానాయుడుపేటలో ద్రౌపది ధర్మారాజు తిరునాళ్ళల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని రేణిగుంట డిఎస్‌పి సంబందిత పోలీసుల అధికారులతో చర్చించారు. భక్తులు ఈ తిరునాళ్ళకు భారీ సంఖ్యలో తరలి వచ్చే అవకాశం వున్నందున ముందస్తుగా ఆదివారం గ్రామంలో కవాతు నిర్వహించారు. గ్రామ ప్రజలు మరియు దేవాలయ ధర్మకర్తలతో సమావేశంమై వారికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి రేణిగుంట సిఐ, ఎస్‌లు, ట్రైనీ ఎస్‌లు సిబ్బంది పాల్గొన్నారు

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు



కాణిపాకం, ఆగస్టు 3 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని ఆదివారం పలువురు దర్శించుకున్నారు. ఈమేరకు రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ ఎస్ఎస్. శ్రీధర్, మాజీ ఐఏఎస్ అధికారి ఐవిఆర్.కృష్ణారావులు కుటుంబసమేతంగా వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమన్నారాయణ..నారాయణ హరేహరే అన్నిమంత్రముల తోడను

### -అద్భుతంగా శ్రేయజోషి కూచిపూడినృత్యం



తిరుమల,ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి: చిన్నవయస్సులోనూ భగవంతునిపై విశ్వాసం...ఆయన నామసంకీర్తనలు చేస్తే కలిగే పుణ్యఫలం ప్రతిబింబిస్తూ చిన్నారి శ్రేయజోషి కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. తిరుమలలో ఆలయానికి ఎదురుగా ఉన్న నాదనీరాజనం వేదికపై ఆదివారం సాయంత్రం తిరుపతికి చెందిన కుమారి భానుజ బృందంలో కళారత్న డాక్టర్ ఉషారాణి శిష్యురాలు శ్రేయజోషి నృత్యార్చన సమర్పించారు. "శ్రీమన్నారాయణ..నారాయణ హరేహరే...అన్నిమంత్రముల తోడను"అనే సంకీర్తనలకు ప్రతి మంత్రం ఆ దేవదేవునికే దారిచూపుతుందనే భక్తిని చాటిచెప్పేలా జోషి నృత్యం అద్భుతంగా అలరించింది. టిటిడి జెఈఓ వీరబ్రహ్మం కుమార్తె శ్రేయజోషి నృత్యాన్ని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, టిటిడి అధికారులు వీక్షించి అభినందించారు.

## పోలీసు రాత పరీక్షల్లో సత్తా చాటిన రాయపేడు యువతి



కేవీబీ పురం, ఆగస్టు 3 ప్రభాతవార్త: రాష్ట్ర పోలీసు శాఖ విడుదల చేసిన పోలీసు రాత పరీక్ష ఫలితాల్లో కేవీబీ పురం మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన మేరీ, నాధముని దంపతుల కుమార్తె రీచా ప్రత్యేకమైన ప్రతిభను కనబరచింది. గతంలో నిర్వహించిన శారీరక దారుఢ్య పరీక్షల్లో ఎంపికైన ఆమె రాత పరీక్షల్లో కూడాప్రత్యేక ప్రతిభను కనబరచి 108 మార్కులు సాధించి సివిల్ పోలీసుగా ఎంపికైంది. అలాగే ఆమె తమ్ముడు సూర్య రెండు సంవత్సరాల క్రితమే ఇండియన్ ఆర్మీలో స్థానం పొందాడు. దీంతో ఒకే ఇంట్లో నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరికి ఉద్యోగం రావడం పట్ల తల్లి పడిన కష్టానికి మంచి ఫలితమే దక్కిందని గ్రామస్తులు, యువకులు అభినందించారు.

## ఎన్‌హెచ్ 16 శ్రీసిటీ కూడలిలో మౌలిక వసతుల అభివృద్ధి

### ప్రభుత్వం చొరవను ప్రశంసించిన శ్రీసిటీ ఎండీ





సత్యవేడు, ఆగస్టు 3 ప్రభాతవార్త: పారిశ్రామిక రవాణా సదుపాయాలను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా జాతీయ రహదారి-16(ఎన్‌హెచ్-16) లోని శ్రీసిటీ ముఖ ద్వారం(ఎంట్రీ పాయింట్) వద్ద దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టు పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు వర్చువల్‌గా పునాది వేశారు. వీటిలో ఫ్లై ఓవర్లు, బైపాస్‌లు, రోడ్డు విస్తరణ ఓవర్ బ్రిడ్జిలనిర్మాణం ఉన్నాయి. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్, పారిశ్రామిక శక్తి కేంద్రంగా మార్చడం లక్ష్యంగా నిర్దేశించబడ్డాయి. శ్రీసిటీ ఎంటీ పాయింట్ వద్ద కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో రూ.45 కోట్ల పెట్టుబడితో 900 మీటర్ల గ్రేడ్-సెపరేటెడ్‌జంక్షన్ నిర్మించనున్నారు. అలాగే రోడ్డు, రైలు రవాణా అనుసంధానం, సమీపంలో పలు ఓడరేవు సదుపాయాలను కలిగి ఉండి, ఇప్పటికే శ్రీసిటీప్రపంచ తయారీ పరిశ్రమలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. ప్రస్తుతం ఈ మౌలిక సదుపాయాల పెంపు ద్వారా పెట్టుబడి అవకాశాలను మరింత మెరుగుపరచనుంది.

## స్నేహితుల దినోత్సవాన...పాతవాళ్ళ అపూర్వకలయిక



తిరుపతి,ఆగస్టు 3ప్రభాతవార్త: గత 42 సంవత్సరాలుగా ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవాన కలుసుకుని తమతమ అభిప్రాయాలు, ఇతోధిక సేవాభావం గురించి వారంతా చర్చించుకుని మంచి చేయడమో ఆశయంగా ముందుకు నడుస్తున్నారు. ఇదీ 1983-84 సంవత్సరం తిరుపతి నెహ్రూ మున్సిపల్ ఉన్నతపాఠశాల పదవతరగతి బ్యాచ్ స్నేహితులు. ఆదివారం ఓ హోటల్‌లో పూర్వ విద్యార్థులంతా ఒక్కటై తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. 42ఏళ్ళతరువాత కొందరు కలుసుకోవడం వారిలో ఉద్విగ్నభరితంగా కనిపించింది. పూర్వవిద్యార్థుల సంఘం కందారపు మురళి, కెవిల్ వర్మల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అపూర్వంగా కలుసుకోవడం మరచిపోలేమన్నారు. అనంతరం అందరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు పగడాల అర్జున్, ఆర్ఆర్ శ్రీనివాస్,జయచంద్ర, శ్రీనివాసులు, సుబ్బారావు, సుబ్రమణ్యం, మన్నేపల్లి బాలకృష్ణ, కందారపు సురేంద్ర, బివి రాయ్, ముని,చంద్రమౌళి, చెంగయ్య,గురుమూర్తి, గిరి,బాల, శ్రీనివాస్, ఉమా, కృష్ణయ్య ఉన్నారు.

## కల్తీ నూనె విక్రయాలపై చర్యలు తీసుకోండి

### మంత్రికి బీజేపీ నేత సామంచి శ్రీనివాస్ విజ్ఞప్తి

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 3 ప్రభాతవార్త:



తిరుపతి నగరంలో కల్తీ వంట నూనె విక్రయాలు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, ఈ విషయంలో జిల్లా ఆహార భద్రతా అధికారుల నిర్లక్ష్యం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేస్తూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ మార్కెట్లలో నకిలీ బ్రాండ్ల నూనెను లేబులింగ్ లేకుండా విక్రయిస్తున్న వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ఫిర్యాదు చేసి, వినతిపత్రం సమర్పించారు. కల్తీ నూనె వాడకంతో గ్యాస్, అజీర్ణం, గుండె మరియు లివర్ సంబంధిత వ్యాధులతో పాటు క్యాన్సర్ వంటి జబ్బులు కూడా అధికంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రేణిగుంట, బస్టాండ్, రైల్వే స్టేషన్, బైరాగిపట్టెడ ప్రాంతాల్లో అనధికారికంగా నూనెను విక్రయిస్తున్న వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే ప్రజల ఆరోగ్యాన్ని ముప్పు పెట్టుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు పక్కన భోజన కేంద్రాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఈ నకిలీ నూనెను వినియోగిస్తున్నాయని ఆరోపించారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం తిరుపతికి కేటాయించిన ఆహార భద్రతా తనిఖీ వాహనం ఇప్పటి వరకు ప్రజలకు ఉపయోగపడకపోవడం విచారకరమని, దీనిని తిరుపతిలో తనిఖీలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలా ఆనంద్, భాను ప్రకాష్ రెడ్డి, బిజెపి ప్రధాన కార్యదర్శు డాక్టర్ నరేష్, బీడీ బాలాజీ, నరేష్ ఉపాధ్యక్షులు పాల్గొన్నారు



తిరుమలలోని తుంబురతీర్థంను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, బృందం

ప్రభాతవార్త తిరుమల



తిరుమలకు చేరుకున్న కర్నాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్‌కి స్వాగతం పలుకుతున్న టిటిడి ఓఎస్‌డి నాయక్

ప్రభాతవార్త తిరుమల


**KUPPAM MUNICIPALITY**

**'e' Procurement Tender Notice**

**Roc.No:1924/2024/E1, Dt:04-08-2025**
**Tender Notice No.07/2025-26/AE, Dt:04-08-2025**

1. No.of Works : 3 No's
2. T.S.Amount / E.C.V. Amount : 88.00 Lakhs
3. Bid Document Downloading Start Date : 04.08.2025 at 11.00 A.M.
4. Bid Document Downloading End Date : 18.08.2025 at 3.00 P.M.
5. Bid Document Submission Closing Date: 18.08.2025 at 3.30. P.M.
6. Price Bid Opening Date : 18.08.2025 at 3.31 P.M.
7. Name & Address of the Concerned Officer: Commissioner, Kuppam Municipality, kuppam - 517425. Cell :9849901049.

Further details can be seen @ e 'procurement market place at https://tender.apeprocurement.gov.in from 04.08.2025 at 11.00A.M.

Sd/-Commissioner,Kuppam Municipality